ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 34.0 25.0



మైదానంలో దీపావళి రాకెట్లతో దాడులు చేసుకుంటున్న దృశ్యం (ఫైల్)



ఎన్నికల ఫలితాలపై రాళ్లదాడి కేసు భవితవ్యం
ప్రతిపక్షంలో ఎవరున్నా, ఐదేళ్లు నరకమే!
పాత కేసులతో ప్రస్తుత దాడులను పోల్చుతూ చర్చ

ఎవరు ఇరుక్కుంటారో?

అజ్ఞాతంలోకి ఇరు పార్టీల వర్గీయులు

మా పార్టీ అధికారంలోకి వస్తే మేము సేఫ్. లేదు లేదు గెలిచేది మా పార్టీనే. కాబట్టి మాకేం కాదు. ఇదీ పట్టణంలో జరిగిన రాళ్లదాడిలో పాల్గొని, అజ్ఞాతంలో ఉన్న ఇరుపార్టీల వారి ధీమా. సార్వత్రిక ఎన్నికల రోజున పట్టణంలోని ఓంశాంతినగర్, పాతకోట ప్రాంతాల్లో రాళ్ల దాడులు జరిగిన 24గంటల్లోనే మరోసారి వైసీపీ శ్రేణులు పట్టణంలోని గానుగవీధిలోని టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటి సమీపంలో రాళ్లవర్షం కురిపించారు. అయితే ఈ ఘటనలకు ఎలాంటి సంబంధం లేని ఇరువర్గాల వారిని కూడా పోలీసు ఉన్నతాధికారులు కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. దీంతో ఇప్పటికే ద్వితీయశ్రేణి నాయకులంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోతూ తమకు సంబంధించిన వారిని కూడా మరో 20రోజులు కనిపించకుండా పోదాం పదా అంటూ వారి వెంట తీసుకువెళుతున్నట్లు సమాచారం. ఎన్నికల ఫలితాల అనంతరం అధికారంలోకి వచ్చే పార్టీపై తమ భవితవ్యం ఆధారపడి ఉంటుందని ఎవరికి వారు చెప్పుకుం టున్నట్లు సమా చారం.

- తాడిపత్రి టౌన్

ప్రబోధానంద కేసులో మాదిరిగానేనా..?

గతంలో ప్రబోధానంద కేసులో కూడా ఇలాగే జరిగిందంటూ చెబుతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్న చివరి ఏడాదిలో ప్రబోధానంద ఆశ్రమంపై దాడి జరిగింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ సంఘటనలో ఎటువంటి సంబంధం లేని టీడీపీ నాయకులు, కార్యకర్తలను సైతం పోలీసులు కేసుల్లో చేరుస్తూ దాదాపు మూడేళ్లపాటు ఈ కేసును సాగదీస్తూ వచ్చారు. వైసీపీకి ఎవరు ఎదురుదిరిగితే వారిపై ప్రభోదానంద కేసు రుద్దుతూ నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి 15రోజులపాటు జిల్లాకేంద్రంలోని జైలుతో పాటు కడప సబ్‌జైలుకు కూడా తీసుకువెళ్లేలా వైసీపీ నాయకులు ఒత్తిడి తెచ్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. దీన్నిబట్టిచూస్తే మరో ప్రభోదానంద ఆశ్రమం కేసులాగా రాళ్లదాడి మారుతుందని కూడా పట్టణంలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఎవరు అధికారంలోకి వస్తే వారిదే పైచేయి అవుతుందని, అప్పటికి వారు చెప్పినట్లే కేసులు కూడా నమోదవుతాయని చర్చించుకుంటున్నారు. అప్పట్లో ఎటువంటి సంబంధంలేని కొంతమంది పెద్దవడుగూరు, యాడికి, పుట్లూరు, యల్లనూరు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేయించారు. ప్రస్తుతం రాళ్లదాడి కేసులో 93 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని అనంతపురం, ఉరవకొండ కోర్టుల్లో హాజరుపరిచారు. అనంతరం కడప జైలుకు రిమాండ్‌కు తరలించారు. మరోవైపు ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రతిపక్షంలో ఉన్న వారికి వచ్చే ఐదేళ్లు నరకమే అంటూ గ్రామాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.



రాళ్లదాడులు చేసుకుంటున్న దృశ్యం(ఫైల్)

సిట్ రాకతో పోలీసుల్లో అలజడి

పట్టణంలో జరిగిన సంఘటనలను కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణను సస్పెండ్ చేసింది. అంతటితో ఆగకుండా ప్రత్యేకంగా సిట్ బృందాన్ని ఏర్పాటుచేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. రెండురోజులపాటు సిట్ బృందం సభ్యులు డీఎస్పీ శ్రీనివాసులు, ఏసీబీ డీఎస్పీ భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాస్ విచారణ చేశారు. సంఘటనా స్థలాల్లో కూడా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సంఘటనలో కొంత మంది కిందిస్థాయి సిబ్బంది నాయకుల వద్ద అత్యుత్సాహం ప్రదర్శించారని చర్చ సాగుతుండటంతో అలాంటి వారిలో అలజడి రేగుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్లపై అర్ధరాత్రి సమయంలో దాడి చేయడం, ఇంటిలోని విలువైన వస్తువులను ధ్వంసం చేయడం వంటి ఘటనలకు సంబంధించిన సీసీ ఫుటేజీలు బయటకు రావడంతో పాల్గొన్న అధికారులు, సిబ్బందిలో కలవరం మొదలైంది. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ ఇంటి పరిసరాల్లో కూడా సిట్ బృందం సభ్యులు విచారించడం గమనార్హం.



ఓంశాంతినగర్‌లో ఎస్ఐతో వివరాలు తెలుసుకుంటున్న సిట్ బృందం సభ్యులు (ఫైల్)

వందల సంఖ్యలో అజ్ఞాతంలోకి...

తాడిపత్రిలో రాళ్లదాడుల్లో పాల్గొన్న ఇరువర్గాలకు చెందిన ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో అజ్ఞాతంలోకి వెళ్లారు. ఎవరి ఆర్థికస్తోమతను బట్టి వారు జిల్లా, రాష్ట్రం విడిచిపెట్టి వెళ్లారని తెలుస్తోంది. కొందరైతే పుణ్యక్షేత్రాలకు వెళితే ఎవరికి అనుమానం రాదన్న ఆలోచనతో తిరుపతి, విజయవాడ, వైజాగ్, అన్నవరం తదితర ప్రాంతాలకు వెళ్లారని సమాచారం. మరికొందరు గోవా, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర నగరాల్లో తలదాచుకుంటున్నట్లు సమాచారం.

వ్యాపారం పడిపోయింది

ఎన్నికల అనంతరం తాడిపత్రిలో వరుసగా దాడులు జరగడంతో ఎలాంటి వ్యాపారాలు లేవు. మా లాంటి చిరువ్యాపారుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. రోడ్లపైకి ప్రజలు రావాలంటేనే జంకుతున్నారు. దీంతో మా వ్యాపారం దెబ్బతింది. పట్టణంలో ఎటుచూసినా పోలీసులే కనిపిస్తున్నారు. పరిస్థితులు ఎప్పుడు చక్కబడతాయో అర్థం కావడం లేదు.

- మహబూబ్‌బాషా, పండ్ల వ్యాపారి, తాడిపత్రి

భయమేస్తోంది

తాడిపత్రిలో రాళ్లదాడి అనంతరం గ్రామాల్లోకి పోలీసులు వస్తున్నారంటే భయంగా ఉంది. తాడిపత్రిలో అల్లర్లు జరిగితే యల్లనూరు మండలంలో పోలీసులు తనిఖీలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. ఎప్పుడు ఎవరిని తీసుకువెళ్లి కేసులు నమోదు చేస్తారో ఏమోనని భయమేస్తోంది. దాడుల్లో పాల్గొన్న వారిని గుర్తించి కేసులు నమోదుచేయాలి.

- లక్ష్మీదేవి, యల్లనూరు

ప్రజలు భయాందోళనలో ఉన్నారు

ఎన్నికల అనంతరం తాడిపత్రిలో అల్లర్ల నేపథ్యంలో పోలీసులు ఎప్పుడు ఎవరిని అదుపులోకి తీసుకుంటారో అనే భయాందోళనలో ప్రజలు ఉన్నారు. ఇప్పటికే ఇరుపార్టీల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు గ్రామాలను వదిలివెళ్లారు. దీంతో పిల్లలు, కుటుంబసభ్యులు బిక్కుబిక్కుమంటూ బతుకున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో తమ వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయో అంటూ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

- శేఖర్, రైతు, రాయలచెరువు, యాడికి మండలం



కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసేలా చర్యలు
నూతన ఎస్పీ గౌతమి శాలి

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ

శాంతి భద్రతల

పరిరక్షణే లక్ష్యం

అనంతపురం క్రైం, మే 19: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే తన లక్ష్యమని జిల్లా నూతన ఎస్పీ గౌతమి శాలి స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీగా ఆమె తన చాంబర్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు జిల్లా ఎస్పీగా ఉన్న అమిత్‌బర్దర్‌పై ఎన్నికల సంఘం సస్పెన్షన్ వేటు వేసి, విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న గౌతమి శాలిని జిల్లా ఎస్పీగా నియమించడం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి కార్యాచరణ ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో మాట్లాడి మెరుగైన పోలీసింగ్‌కు కృషి చేస్తామన్నారు. సెన్సిటివ్ గ్రామాలు, బైండోవర్లు ఏదైనా సరే చట్టపరంగా ముందుకెళ్తామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టంగా మూడంచెల భద్రత కొనసాగుతోందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా ఎలాంటి హింస, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మూడంచెల భద్రతను మరింత బలోపేతం చేయండి

జేఎన్‌టీయూ స్ట్రాంగ్ రూంల భద్రతను జిల్లా ఎస్పీ గౌతమి శాలి పరిశీలించారు. కేరళ సాయుధ స్పెషల్ పోలీసులు, ఏఆర్ సాయుధ పోలీసులు మూడంచెల భద్రత నిర్వహిస్తుండటాన్ని సమీక్షించి మరింత బలోపేతం చేయా లని ఆదేశించారు. పార్కింగ్ స్థలాన్ని స్ట్రాంగ్ రూంలకు దూరంగా ఏర్పాటు చేయాలని, అన్ని గేట్లలోను సిబ్బందిని బందోబస్తుకు నియమించాలని సూచించారు. కౌంటింగ్ రోజున తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు, హింసకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, సీఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర, రెడ్డప్ప, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 మండలాల్లో వర్షం



అనంతపురం అర్బన్, మే 19: జిల్లాలోని 12 మండలాల్లో శనివారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా గుత్తిలో 81.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. రాయదుర్గం 42.6, శెట్టూరు 38.4, యల్లనూరు 35.8, కుందుర్పి 20.6, పుట్లూరు 8.0, డి. హిరేహాల్ 6.8, గుమ్మగట్ట 3.6, కంబదూరు 2.6, రాప్తాడు, కణేకల్లు 1.0 మీ.మీ వర్షపాతం నమోదైంది.



అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియం

పిల్లలకు ఆటల్లేవ్!

వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు లేనట్లే

ఐదేళ్లలో రెండుసార్లే నిర్వహణ
పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణ పట్ల శీతకన్ను వేసింది. ఐదేళ్ల పాలనా కాలంలో రెండేళ్లు మాత్రమే ఈ శిబిరాలు నిర్వహించింది. అందులోనూ క్రీడాకారులకు ఎటువంటి కిట్లు ఇవ్వకుండా, కోచ్‌లకు గౌరవ వేతనం చెల్లించకుండా మమా అనిపించేసింది. ఈ ఏడాదిలో మే 1 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తామని కోచ్‌ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తరువాత సార్వత్రిక ఎన్నికలు అంటూ మే 15కి వాయిదా వేశారు. తిరిగి ఈ ఏడాది రెగ్యులర్‌గా శాప్ కోచ్‌లు నిర్వహించే శిక్షణ కేంద్రాలనే సమ్మర్ కోచింగ్ క్యాంపులుగా నిర్వహించాలని శాప్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో వందలాది మంది క్రీడాకారులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన స్థానాలను సంపాదించుకున్నారు.

- అనంతపురం క్లాక్‌టవర్

రెండేళ్లే నిర్వహణ..

వైసీపీ ఐదేళ్ల పాలనా కాలంలో రెండేళ్లే వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైనా ఆ ఏడాదిలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించలేదు. 2020, 2021లో కరోనా సాకుతో నిర్వహించకుండా వదిలేశారు. 2022, 2023లో నామమాత్రంగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించారు. మొత్తం జిల్లాకు 50సెంటర్ల పేరుతో హడావుడి చేసినా చివరికి నిర్వహించింది 30మాత్రమే. ఇందులో కూడా క్రీడాకారులకు సామాగ్రి లేదు, కోచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వలేదు. దీంతో అటు క్రీడాకారులు, ఇటు కోచ్‌లు వేసవి క్రీడా శిక్షణా శిబిరాల పట్ల నిరాసక్తత ప్రదర్శించారు. ఇదే అదనుగా రాష్ట్ర ప్రభుత్వం సమ్మర్ కోచింగ్ క్యాంపులను ఎత్తివేసింది.



పిల్లలను క్రీడలకు దూరం చేస్తున్న వైనం

క్రీడలు, వ్యాయామం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ప్రగల్భాలు పలికిన సీఎం జగన్ ఆచరణలో మాత్రం నిర్వీర్యం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను గాలికొదిలేసింది. దీంతో వేసవి సెలవుల్లో బాగా ఆడాలని ఎదురుచూసిన పిల్లలు వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణ లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఇదంతా పిల్లలను క్రీడలకు దూరం చేయడంలో భాగమేనని క్రీడాకారులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 100 కేంద్రాల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించి, క్రీడాకారులకు కిట్లు, కోచ్‌లకు గౌరవ వేతనం ఇచ్చిన విషయాన్ని ప్రస్తుతం కొందరు గుర్తు చేసుకుంటున్నారు.

శాప్ కోచ్‌లతోనే...: షేక్ షఫీ, డీఎస్‌డీఓ

సమ్మర్ కోచింగ్ క్యాంపుల నిర్వహణకు దరఖాస్తులు తీసుకున్న మాట వాస్తవమే. శాప్ ఆదేశాల మేరకే కోచ్‌ల నుంచి దరఖాస్తులను స్వీకరించాం. మే 1 నుంచి అన్నారు...ఆ తరువాత మే 15కి వాయిదావేశారు. ఇక ఏడాదికి సంబంధించి శాప్ కోచ్‌లు ఇస్తున్న రెగ్యులర్ కేంద్రాల్లోనే వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించాలని శాప్ అధికారులు సూచించారు. ఈ విషయాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న 12మంది శాప్ కోచ్‌లకు సూచించాం. శాప్ ఆదేశాల మేరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నాం.

ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోండి



అనంతపురం అర్బన్, మే 19: సబ్సిడీ విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు తమ పేర్లను స్థానిక ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 18న రైతుల పేర్ల నమోదు ప్రక్రియ మొదలైందన్నారు. ఇప్పటి దాకా 29 మండలాల్లో 2539 మంది రైతులు 2249 క్వింటాళ్ల వేరుశనగ కోసం తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈనెల 24 నుంచి విత్తన పంపిణీ మొదలు పెడతామన్నారు.



నిర్ణేత అతడే!

ఓటింగ్‌లో పురుషులదే పైచేయి
మహిళా ఓటర్లు అధికం... ఓటింగ్ మాత్రం తక్కువ
అధికార వైసీపీలో ఆందోళన

అనంతపురం టౌన్: ఇటీవల ముగిసిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల కంటే పురుషులే ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం. అయినా మహిళా ఓటర్ల కన్నా పురుషులు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో పురుష ఓటర్లు 9,97,792 మంది ఉండగా, మహిళా ఓటర్లు 10,20,124మంది ఉన్నారు. ఇందులో పురుషుల ఓటర్లు 8,37,451మంది, మహిళా ఓటర్లు 8,18,996 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాప్తాడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈఎనిమిది నియోజక వర్గాలలో మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కంటే 22,333 మంది అధికంగా ఉన్నారు. కానీ ఓటింగ్‌లో మాత్రం పురుషులు మహిళల కన్నా 18,455మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

● వైసీపీలో గుబులు



రాష్ట్రంలో అన్ని జిల్లాలలోను మహిళలలే అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని, వారు సీఎం జగన్‌కే మద్దతు ఇచ్చి ఉంటారని, అందుకే తామే మళ్లీ అధికారంలోకి వస్తామని వైసీపీ నేతలు బీరాలు పలుకుతున్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా అనంత జిల్లాలో మహిళా ఓటర్ల కన్నా పురుషులే ఎక్కువగా ఓటు వేయడానికి ముందుకు వచ్చారు. అదికూడా ప్రతి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నా అన్ని నియోజకవర్గాలలోను పురుషులే ఎక్కువగా ఓటు వేయడానికి రావడం, మహిళలు ఓటుకు దూరంగా ఉండటం ఫ్యాన్ పార్టీ నాయకుల్లో ఆందోళన కలిగిస్తోంది. వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు, భూఆక్రమణలు, ఇసుక, మద్యం అక్రమ రవాణతో పాటు మద్యం ధరలు విపరీతంగా పెంచడం, రైతులను ఆదుకోవడంలో మీనమేషాలు లెక్కించడం, ఉద్యోగాల కల్పన లేకపోవడం వంటి వాటి గురించి పురుష ఓటర్లలో వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్ పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఈనేపథ్యమే పురుషుల ఓటింగ్ ఎక్కువగా నమోదవడానికి కారణమవుతోంది. ఈ అంశమే వైసీపీ నేతల్లో ఆందోళన కలిగిస్తోంది. కళ్యాణదుర్గంలో 24.59శాతం, ఉరవకొండలో 2.53శాతం, శింగనమలలో 2.48శాతం, రాయదుర్గంలో 1.76శాతం, గుంతకల్లులో 2.08 శాతం, రాప్తాడులో 1.53శాతం, అనంతపురం అర్బన్‌లో 0.63శాతం, తాడిపత్రిలో 0.53శాతం మంది పురుష ఓటర్లు మహిళల కంటే అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గం	పురుష ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం	మహిళా ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
రాయదుర్గం	130794	113253	86.58	133516	113253	84.82
ఉరవకొండ	110540	96241	87.06	113771	96182	84.53
గుంతకల్లు	132943	101539	76.37	137630	102251	74.29
తాడిపత్రి	123496	102898	83.32	125358	103792	82.79
శింగనమల	122927	103438	84.14	124417	101610	81.66
కళ్యాణదుర్గం	114356	102905	89.98	143479	93,825	65.39
రాప్తాడు	125028	1,07,349	85.85	1,25,531	1,05,856	84.32
అనంతపురం అర్బన్	137708	89188	65.39	143479	93825	64.76

అనంతపురంలో దుకాణం వద్ద మద్యం కొనుగోలు చేస్తున్న జనం



మళ్లీ డిజిటల్ లావాదేవీలు బంద్!

లెక్క ఇస్తేనే.. చుక్క!

పోలింగ్‌కు ముందు కేవలం డిజిటల్ లావాదేవీల నిర్వహణ
పలు దుకాణాల్లో చిల్లర సమస్యతో సతమతం
కావాల్సిన మద్యం బ్రాండ్లు కరువు



అనంతపురం అర్బన్, మే 19: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మళ్లీ పాత పద్ధతిలో నగదు లావాదేవీలే జరుపుతున్నారు. పోలింగ్‌కు వారం రోజుల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలను (ఫోన్ పే, గుగూల్ పే) మాత్రమే అనుమతించారు. ఆయా రోజుల్లో ఎక్కడా నగదు తీసుకోలేదు. ఈనెల 13న ఎన్నికల పోలింగ్ జరిగింది. అనంతరం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలను బంద్ చేశారు. జిల్లాలో 127 ప్రభుత్వ మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. వీటిలో 90 శాతం దుకాణాల్లో ప్రస్తుతం నగదు లావాదేవీలు మాత్రమే జరుపుతున్నారు. ఆయా దుకాణాల్లో ఎక్కడా ఫోన్ పే, గుగూల్ పే ద్వారా డబ్బులు స్వీకరించడం లేదు. దీంతో ఇదెక్కడి అన్యాయమంటూ మద్యంప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ లావాదేవీలు, నగదు రెండు ఆప్షన్లు ఇవ్వకుండా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై మందు బాబులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఎన్నికల పోలింగ్ ముగిసింది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు కేవలం జే బ్రాండ్స్‌ను మాత్రమే సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో లెక్కలు తారుమారైతే జే బ్రాండ్స్ నిల్వలు అలాగే ఉండిపోతాయన్న భయంతో ఇప్పటి దాకా నిల్వ చేసిన సరుకును ప్రభుత్వ దుకాణాలకు పంపుతున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో కేవలం జే బ్రాండ్స్ మాత్రమే దర్శనమిస్తున్నాయి. మందు బాబులకు ఇష్టమైన బ్రాండ్లను ఎక్కడా ఉంచలేదు. దీంతో మందుబాబులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. తప్పని పరిస్థితుల్లో కొందరు జే బ్రాండ్స్‌ను తీసుకోగా.. మరికొందరు ఇదేం ఖర్మ అంటూ నిరాశతో వెనుతిరుగుతున్నారు. మరోవైపు పలు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చిల్లర సమస్య ఏర్పడింది. అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్, నందిని హోటల్ వద్ద ఉన్న దుకాణాలతో పాటు పలు దుకాణాల్లో మద్యం బాటిల్‌కు కావాల్సిన డబ్బులు చిల్లరతో ఇస్తేనే మద్యం విక్రయిస్తున్నారు. లేదంటే నిర్దాక్షిణ్యంగా తమ వద్ద చిల్లర లేదంటూ చేతులెత్తేస్తున్నారు. ఫోన్ పే ద్వారా డబ్బులు వేస్తామన్నా ఆ సదుపాయం తమ వద్ద లేదంటూ చెబుతుండటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో మందు బాబులు పడరానిపాట్లు పడుతున్నారు.

జే బ్రాండ్స్ అంటగడుతున్న వైనం



అనంతపురంలోని ప్రభుత్వ మద్యం దుకాణం



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ, కమిషనర్

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం టౌన్, మే 19: స్థానిక జేఎన్‌టీయూలో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్ ఆదివారం పరిశీలించారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల కౌంటింగ్ చేపట్టే గదుల్లో ఏర్పాట్లనూ పరిశీలించారు. వారి వెంట ఆర్‌ఓలు రాణిసుష్మిత, వెన్నెల శ్రీను, నోడల్ అధికారులు ఓబులరెడ్డి, సురేంద్ర, వీర్రాజు, రూప్లానాయక్ ఉన్నారు.

ప్రశాంతంగా ఆర్డీటీ సెట్

- 3,868 మంది హాజరు..




పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 19: ఆర్డీటీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పదవ తరగతి 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్త మ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి నిర్వహించే ఆర్డీటీ ప్రవేశ పరీక్ష ఆదివారం కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన 11 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. 100మార్కులకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.10గంటల వరకు నిర్వహించారు. ఈ ఏడాదికి సంబంధించి 360సీట్లకు గాను 3,928మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,868మంది విద్యార్థులు హాజరయ్యారు. 60మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఆర్డీటీ డైరెక్టర్లు నిర్మల్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, నిరంజన్, సాయికృష్ణ, కృష్ణవేణి, శీబా, మోహన్‌మురళీ, లక్ష్మణరావు డైరెక్టర్ మోహన్‌మురళీ పాల్గొన్నారు. వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేయనున్నారు.

ఈతకెళ్లి బాలుడి మృతి

బుక్కరాయసముద్రం, మే 19: స్థానిక చిక్కవడియార్ చెరువులోకి ఈతకెళ్లి బాలుడు ఇమామ్‌బాషా (12) నీటి గుంతలో పడి ఆదివారం మరణించాడు. మండల కేంద్రంలోని ఇస్లాంపూర్ కాలనీకి చెందిన రజాక్‌వలి, అరుణ కుమారుడు ఇమామ్‌బాషా ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో స్నేహితులతో కలిసి సిద్దరాంపురం రోడ్డు వైపు బీకేఎస్ చెరువులోకి ఈతకు వెళ్లారు. లోతు తక్కువ ఉన్నచోట నీటిలో మొదట దిగాడు. ముందువైపు లోతు ఉన్న విషయం గ్రహించలేక అటు వైపు వెళ్లాడు. లోతైన నీటి గుంతలోకి వెళ్లిన ఆ బాలుడు ఈత రాక మునిగిపోయాడు. స్నేహితులు వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. గంటపాటు గాలించగా.. ఇమామ్‌బాషా మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తులో ఉంది.

ఉత్తుత్తి బటన్!





ముఖ్యమంత్రి బటన్ నొక్కి దాదాపు మూడు నెలలు కావస్తున్నా జగనన్న విద్యాదీవెన సొమ్ము అందక పలువురు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది మార్చి 1న సీఎం జగన్మోహన్‌రెడ్డి కృష్ణాజిల్లా పామర్రులో జగనన్న విద్యాదీవెన సొమ్ము విడుదలకు బటన్ నొక్కారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రెండు వేల మంది విద్యార్థులకు మాత్రమే ఆ పథకం లబ్ధి అందినట్లు అధికారవర్గాల సమాచారం. మిగిలిన విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాల నుంచి ఫీజు ఒత్తిళ్లు అధికమయ్యాయి. పరీక్షల సమయంలో ఫీజు కడితేనే హాల్ టిక్కెట్లు ఇస్తామని కాలేజీ యాజమాన్యాలు తెగేసి చెప్పిన సందర్భాలు ఉన్నాయి. విద్యాదీవెన సొమ్ము వస్తుందనే నమ్మకంతో చదివిస్తున్న తమకు ఇలా మోసం చేస్తే ఎలా అని విద్యార్థులు వారి తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

అనంతపురం ప్రెస్‌క్లబ్

- నేటికీ అందని విద్యాదీవెన సొమ్ము
- ఫీజు కోసం కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి
- డబ్బుకట్టి హాల్ టిక్కెట్ తీసుకున్న విద్యార్థులు
- ప్రభుత్వ తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆగ్రహం

రెండు వేల మందికే..?

జగనన్న విద్యాదీవెనకు సంబంధించి జిల్లాలో ఇంతవరకు రెండువేల మందికి మాత్రమే నగదు జమైనట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో 200 మందికి కూడా విద్యాదీవెన సొమ్ము జమ కానట్లు పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. పథకాలకు సంబంధించిన నగదు ఇవ్వకుండా మోసం చేశారంటూ ప్రజల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం మూడ్రోజుల కిందట బటన్ నొక్కిన పథకాలకు సంబంధించి నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. అందులో భాగం గా రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విద్యాదీవెనకు రూ. 200 కోట్లు విడుదల చేశామని.. ఒకటి రెం డ్రోజుల్లో ఖాతాలకు జమవుతాయని ప్రకటించింది. మూడ్రోజులు గడిచినా ఇంత వరకూ ఒక్క విద్యార్థి తల్లి ఖాతాకు కూడా నగదు జమకాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మార్చి 1న బటన్ నొక్కినా...

ఈ ఏడాది జగనన్న విద్యాదీవెన లబ్ధికి సంబంధించి సీఎం జగన్మోహన్‌రెడ్డి మార్చి 1న బటన్ నొక్కినప్పటికీ ఇంత వరకూ అధిక శాతం మంది విద్యార్థులకు నగదు జమ కాలేదు. జిల్లాకు సంబంధించి 40006 మంది విద్యార్థులకు గానూ రూ.29.08 కోట్లు విడుదల చేస్తున్న ట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఎస్సీ విద్యార్థులు 7,104 మందికి రూ. 4.69 కోట్లు, 1635 మంది ఎస్టీ విద్యార్థులకు రూ. 1.15 కోట్లు, 19968 మంది బీసీ విద్యార్థులకు రూ. 13.94 కోట్లు, 2298 మంది కాపు విద్యార్థులకు రూ. 1.84 కోట్లు, 4987 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.4.69 కోట్లు, 3907 మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులకు రూ.2.70 కోట్లు, 107 క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ.ఏడు లక్షలు చొప్పున విద్యార్థుల తల్లుల ఖాతాలకు నగదు జమవుతుందని అధికారులు లెక్కలు చూపారు. అయితే మార్చి నెల 20 లోపు కొంత మంది విద్యార్థులకు నగదు జమైనట్లు సమాచారం. ఆ తరువాత ఒక్క విద్యార్థికి కూడా నగదు జమకాకపోవడం గమనార్హం.

కోతలతోనే నగదు విడుదల..

జగనన్న విద్యాదీవెన ఆర్భాటంగా ప్రవేశపెట్టినప్పటికీ ఆ పథకం ఐదేళ్లల్లో ఎవరికి సక్రమంగా అందలేదన్న విమర్శలు ఉన్నాయి. ఒకరికి ఒక సంవత్సరం ఇస్తే... రెండు సంవత్సరాలు ఎగ్గొట్టడం లేదా ఒక సంవత్సరంలో ఒక విడత ఇవ్వడం... రెండో విడత ఇవ్వకపోవడం ఇలా కోతలతోనే విద్యాదీవెనను అమలు చేశారన్న విమర్శలు విద్యార్థి వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఏదో ఒక బూచి చూపడం, లేదా సాంకేతిక సమస్యలతో దాదాపు సంవత్సరం, రెండేళ్ల పాటు పలువురు విద్యార్థులకు విద్యాదీవెన సొమ్ము అందకుండా చేసిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా విద్యాదీవెనను నమ్ముకున్న విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాల నుంచి ఒత్తిళ్లు తప్పడం లేదు. కొంతమంది విద్యార్థులు విద్యాదీవెన అందకపోవడంతో సొంత డబ్బు చెల్లించారు.

డబ్బు కట్టి హాల్ టిక్కెట్ తీసుకున్నా : మంజునాథ్ గౌడ్, డిగ్రీ ఫైనలియర్



మార్చి 1న జగనన్న విద్యాదీవెన డబ్బులు పడతాయని చూశాం. పడలేదు. వారం తరువాత సచివాలయానికి వెళ్లి ఆరా తీశాం. పడుతాయన్నారు. ఎగ్జామ్స్ దగ్గరపడుతుండటంతో కాలేజీలో హాల్ టిక్కెట్లు ఇస్తున్నారు. నేను వెళ్లి అడిగితే డబ్బులు కడితేనే హాల్ టిక్కెట్ ఇస్తామని చెప్పారు. మా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఏం చేస్తాం మా అమ్మవాళ్లు ఏం చేశారో ఏమో తెలీదు గానీ డబ్బులు కట్టారు. అప్పుడు నాకు హాల్ టికెట్ ఇచ్చారు. కాలేజీ ముగిసే సమయంలో మమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టారు.

రెండేళ్లుగా సొమ్మే పడలేదు: ఆనంద్, డిగ్రీ సెకెండియర్



జగనన్న విద్యాదీవెనకు డిగ్రీ ఫస్టియర్ నుంచి అప్లై చేస్తూ వచ్చా. ఓసారేమో సర్టిఫికెట్లు, అడ్రస్‌లు సరిగ్గాలేవని చెప్పారు. ఎన్ని సార్లు చేసినా డబ్బులు పడలేదు. అలా సంవత్సరమంతా నాకు డబ్బులు రాలేదు. సెకెండియర్‌లో అప్లై చేద్దామని వెళ్తే ఏవో టెక్నికల్ ఇష్యూస్ అని చెప్పి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పోయిన సంవత్సరం అప్లై చేస్తే అన్ని కరెక్టుగా ఉన్నాయన్నారు. లాస్టులోనైనా వస్తుందనుకుంటే... ఇంత వరకూ డబ్బులు పడలేదు. జగనన్న విద్యాదీవెన అంతా మోసం.

ఒక సంవత్సరం పడ్డాయంతే: సాయిస్వరూప



జగనన్న విద్యాదీవెన డబ్బులు నాకు ఫస్టియర్‌లో మాత్రమే వచ్చాయి. తరువాత రెండో సంవత్సరం రాలేదు. ఏమని అడిగితే అన్ని కరెక్టుగా ఉన్నాయి. క్లియర్ అవుతాయని రెండో సంవత్సరం గడిపేశారు. ఇక మూడో సంవత్సరమైనా వస్తాయనుకుంటే పోయిన సంవత్సరం డిసెంబరులో రాలేదు. ఈ సంవత్సరం మార్చి 1న వస్తాయనుకుంటే ఇంత వరకూ రాలేదు. మాలాంటి పేదోళ్లతో ఇలా ఆడుకుంటే ఎలా..? ఇస్తామంటే ఇస్తామని చెప్పాలి. లేదంటే లేదని చెప్పాలి. అంతేగానీ ఇలా మోసం చేయడం ఏమీ బాగోలేదు.



జిల్లాకు చేరిన పుస్తకాలను దించుకుంటున్న గోడౌన్ అధికారులు

మారిన పది సిలబస్...!

- 2024-25 విద్యా సంవత్సరానికి టెన్త్‌కు కొత్త సిలబస్
- ఉమ్మడి జిల్లాకు చేరుకున్న కొత్త పాఠ్యపుస్తకాలు
- ప్రింటర్స్ నుంచి నేరుగా జిల్లాలోని గోడౌన్‌కు..
- 1 నుంచి 7 తరగతుల పుస్తకాలే చేరిక
- 8, 9,10 పుస్తకాలు నేరుగా మండలాలకే..
- జిల్లాలో 51 స్కూళ్లలో సీబీఎస్ఈ గుర్తింపు

అనంతపురం విద్య, మే 19: రానున్న విద్యాసంవత్సరానికి పదవ తరగతి సిలబస్ మారింది. కొత్త పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. 2024-25 విద్యాఏడాదికి సంబంధించిన అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుతున్నాయి. ఈఏడాది 10వ తరగతి విద్యార్థులు మాత్రం మారిన సిలబస్ పుస్తకాలను చదవాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ పాఠ్యపుస్తకాలను 10వ తరగతి విద్యార్థులకు అందించనున్నారు. ఇప్పటికే ముద్రణాలయాల నుంచి జిల్లాలకు చేరుతున్నాయి. గతంలో ప్రింటర్స్ నుంచి అన్ని క్లాసుల పుస్తకాలు జిల్లా కేంద్రంలోని బుక్స్ గోడౌన్లకు పాఠ్యపుస్తకాలు సప్లై చేయగా...గోడౌన్ నుంచి మండల పాయింట్లకు సప్లై చేసేవారు. అయితే ఈ ఏడాది 1వ తరగతి నుంచి 7వ తరగతి పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రంలోని గోడౌన్లకు సప్లై చేస్తుండగా, 8,9,10వ తరగతి పాఠ్యపుస్తకాలను డైరెక్టుగా మండల కేంద్రాలకు సప్లై చేస్తున్నారు.

1 నుంచి 7 వరకు 16,07,743 లక్షల ఇండెంట్...

అనంతపురం, సత్యసాయి రెండు జిల్లాలకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను ప్రింటర్స్ నుంచి అనంతపురం జిల్లా కేంద్రానికే పంపుతున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. అనంతపురం జిల్లా నుంచి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకూ 9,59,226 పుస్తకాల కోసం, సత్యసాయి జిల్లా నుంచి 6,48,517 పుస్తకాల కోసం ఇండెంట్ పంపారు. అయితే అనంతపురం జిల్లాకు ఇప్పటి వరకూ 4,75,020 పుస్తకాలు జిల్లాకు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. సత్యసాయిజిల్లాకు చెందిన పుస్తకాలు సైతం 4,49,125 పుస్తకాలు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 16.07 లక్షల పుస్తకాలకు ఇండెంట్ పెట్టగా....ఇప్పటి వరకూ 9.24 లక్షల పుస్తకాలు జిల్లాకు చేరినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రింటర్ల నుంచి జిల్లా కేంద్రంలోని గోడౌన్లకు చేరిన 1వ తరగతి నుంచి 7వ తరగతి పుస్తకాలను మండలాలకు పంపుతున్నారు.

జిల్లాకు చేరిన కొత్త పుస్తకాలు

హై స్కూల్‌లోని 8,9,10 క్లాసుల పుస్తకాలను ప్రింటర్ల నుంచి మండలాలకే నేరుగా సప్లై చేస్తున్నారు. మండలాలకు చేరిన పుస్తకాలను మళ్లీ స్కూళ్లకు పంపనున్నారు. అయితే ఈ ఏడాది 10వ తరగతి సిలబస్‌ను మార్చారు. 2024-25 విద్యాసంవత్సరంలో జాతీయ విద్యాపరిశోధన,శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సీబీఎస్ ఈ సిలబస్‌తో పాఠ్యపుస్తకాలను ముద్రించారు. ఈ విద్యాసంవత్సరం టెన్త్ విద్యార్థులు మారిన సిలబస్ పుస్తకాలను చదవి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1000 స్కూళ్లకు సీబీఎస్ఈ గుర్తింపు వచ్చింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 51 స్కూళ్లకు గుర్తింపు ఇచ్చినట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఇందులో కళ్యాణదుర్గంలోని కెసి హైస్కూల్‌తోపాటు, 11 మోడల్ స్కూళ్లు, 11 రెసిడెన్షియల్ స్కూళ్లు, 28 కేజీబీవీలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సీబీఎస్ఈ గుర్తింపు ఉన్న స్కూల్ విద్యార్థులు, రాష్ట్ర గుర్తింపు ఉన్న హై స్కూల్ విద్యార్థులు రాసే పరీక్షల్లో తేడా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాల వల్ల అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల్లో కొంత గందరగోళం నెలకొంది.



జిల్లా కేంద్రం లోని గోడౌన్

హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపొద్దు - డాక్టర్ అనుపమ జేమ్స్



వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ

అనంతపురం టౌన్, మే19: హెచ్ఐవీ బాధితులపట్ల వివక్ష చూపరాదని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ డేను పురస్కరించుకుని ఆదివారం అనంతపురంలో వైద్యశాఖ క్యాండిల్ లైట్ ర్యాలీని నిర్వహించింది. డాక్టర్ అనుపమ జేమ్స్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ సప్తగిరి సర్కిల్ వరకు సాగింది. ఈసందర్భంగా డాక్టర్ అనుపమజేమ్స్ మాట్లాడుతూ ఎయిడ్స్‌తో మరణించిన వారికి సంఘీభావం తెలుపుతూ, ఎయిడ్స్‌నివారణకు అందుబాటులో ఉన్న వైద్యసేవలపై అవగాహన కల్పించడానికి ఏటా ఈ క్యాండిల్ లైట్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపట్ల ఎవరైనా వివక్ష చూపితే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం వెంకటరత్నం, సూపర్‌వైజర్ జీవీ రమణ, పీఎంఓ నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, అనంత నెట్‌వర్క్ రామాంజనేయులు, ఈశ్వరయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘర్షణలో మాజీ వలంటీర్ మృతి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాజీజాన్‌సైదా



నిర్జీవంగా పడివున్న అనిల్‌కుమార్

గోరంట్ల, మే 19: మండలంలోని కొత్తబయ్యన్నపల్లి వద్ద జరిగిన ఘర్షణలో మల్లాపల్లి మాజీ వలంటీర్ గొల్ల అనిల్‌కుమార్ (24) ఆదివారం మృతి చెందినట్లు పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా తెలిపారు. మల్లాపల్లి వలంటీర్‌గా రాజీనామా చేసిన గొల్ల అనిల్ కుమార్ అదే గ్రామానికి చెందిన నరసింహమూర్తి, వెంకటనరేష్‌లతో కలిసి ద్విచక్రవాహనంపై కర్ణాటకలోని పెనలపర్తికి మద్యం సేవించడానికి వెళ్లాడు. ఈప్రాంతం మద్యంప్రియులు పెనలపర్తికెళ్లి మద్యం తాగి రావడం పరిపాటి. ఈక్రమంలోనే కొత్త చెరువు ప్రాంతానికి చెందిన కొంతమంది కారులో వెళ్లి మద్యం సేవించి, పెనలపర్తి నుంచి తిరిగి సొంతూరికి బయల్దేరారు. అనిల్‌కుమార్ ద్విచక్రవాహనంపై ఒక్కడే ముందుగా బయల్దేరగా, మిగిలిన ఇద్దరు వెనుక ఆలస్యంగా వస్తున్నారు. మార్గమధ్యలో కారులో వెళ్తున్నవారు అనిల్‌కుమార్‌ల మధ్య ఘర్షణ జరిగింది. అనిల్‌కుమార్‌ను కొట్టడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక వస్తున్న ఇద్దరు మిత్రులు అక్కడికి చేరుకోగా, కొత్తచెరువు ప్రాంత వాసులు కారు వదిలి పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. పోలీసులు కారును స్వాధీనం చేసుకుని, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పెనుకొండకు తరలించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. అయితే ఘర్షణ వెనుక భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. మద్యం తాగే సమయంలో రాజకీయాల గురించి జరిగిన వాదన ఘర్షణకు దారి తీసిందంటున్నారు. అలాగే మృతుడు కారును మార్గ మధ్యలో ఆపి, మద్యం అడిగాడని, వారు ఇవ్వకపోవడంతో గొడవ పడినట్లు కూడా వినిపిస్తున్నాయి. కారుకు దారి వదలకపోవడంతో వారు మృతుడితో ఘర్షణ పడినట్లు మరో వాదన వినిపిస్తోంది. వీటిపై డీఎస్పీ మాట్లాడుతూ ఇందులో రాజకీయ ప్రమేయం లేదని, కారులో ఉన్న వారందరూ నేరప్రవృత్తి కలిగినవారేనని పేర్కొన్నారు. కారులో ఆరుగురు ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరిని పోలీసుల అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఈవిషయం ధ్రువీకరించడంలేదు. త్వరలో నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.

సిట్‌ను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు

తాడిపత్రిటౌన్, మే19: పట్టణంలో హింసపై విచారణకు వచ్చిన సిట్ బృందాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ ఆదివారం కలిశారు. స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌లో ఉన్న సిట్ బృందాన్ని ఆయన కలిసి, దాడిపై విచారణ వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌పై విచక్షణారహితంగా డీఎస్పీ చైతన్య దాడి చేయడంపై సభ్యులకు వివరించారు. ఆయన వెంట లీగల్ సెల్ నాయకులు తిరుపతినాయుడు, ఆదెన్న ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: డీఐజీ



మాట్లాడుతున్న డీఐజీ షిమోషీ

తాడిపత్రిటౌన్, మే19: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం డీఐజీ షిమోషీ హెచ్చరించారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఎస్పీ గౌతమిశాలితో కలిసి డీఐజీ మాట్లాడారు. తాడిపత్రిలో రాళ్లదాడులకు సంబంధించి ఇప్పటికే 93 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపామన్నారు. మరింత మందిని గుర్తించే పనిలో నిమగ్నమైనట్లు తెలిపారు. దాడుల్లో ప్రమేయం ఉన్నవారెవరినీ విడిచిపెట్టమని హెచ్చరించారు. జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాడిపత్రిలో దాడులు, ప్రతిదాడులను దృష్టిలో పెట్టుకుని, సీఆర్పీఎఫ్, ఇండియన్ ఆర్మీ, ర్యాపిడ్, కేంద్ర బలగాలను పెద్దఎత్తున ఇప్పటికే రప్పించామన్నారు. కౌంటింగ్‌కు ముందురోజు మరిన్ని బలగాలను తెప్పించనున్నట్లు తెలిపారు. కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్‌ను ముందుగానే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయనీ, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని డీఐజీ వెల్లడించారు.

తాడిపత్రి ఘటనలో 575 మందిపై కేసులు?

పట్టణంలో తలెత్తిన ఘర్షణకు సంబం ధించి ఇరువర్గాలకు చెందిన 575 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. సిట్ సభ్యులు.. వీరిపై కూడా సిబ్బందిని ఆరాతీసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీరిలో దాదాపు 100 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారని తెలిసింది. మిగిలిన వారిని అరెస్టు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారని అత్యంత విశ్వసనీయ సమాచారం.

వీనులవిందుగా స్వరనీరాజనం

అనంతపురం కల్చరల్, మే 19: అనంత నగర సినీ సంగీత సాంస్కృతిక సమ్మిళిత కళాసంస్థ, పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు లలిత కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పరిషత్ ఆవరణలో నిర్వహించిన స్వరనీరాజనం సంగీత అభిమానులకు వీనులవిందు చేసింది. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 మందికి పైగా సంగీత కళాకారులు హాజరై ఘంటసాల వేంకటేశ్వరరావు పాడిన పాటల్లో 101 పాటలను ఆలపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన ఈ కార్యక్రమంలో ఘంటసాల పాటలను ఆలకిస్తూ సంగీతాభిమానులు మైమరిచిపోయారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు, ఆచార్య సుధాకర్‌బాబు, బాలమురళి, జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, సురేష్, మహిధర్, లక్ష్మీనారాయణ, ఓబులదాస్, జీవీ రామయ్య, వీఆర్‌ఓ ప్రసాద్, చరణ్, నరసింహులు, ఆదినారాయణ, మారుతినాయుడు, సూర్యనారా యణరెడ్డి, సర్దార్‌బాబు, ఎల్‌కేపీ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ, శ్రీదేవి పాల్గొన్నారు.




ఘంటసాల పాటలు ఆలపిస్తున్న గాయనీగాయకులు, కార్యక్రమాన్ని వీక్షిస్తున్న సంగీత అభిమానులు

ఘనంగా రవిశంకర్ గురూజీ పుట్టినరోజు

అనంతపురం క్లాక్‌టవర్, మే 19: ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురూజీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి మమత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి భారీ స్పందన లభించింది. రవిశంకర్ గురూజీ జీవిత స్ఫూర్తితోనే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఇందుకు సహకరించిన దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కౌసల్య, నార్పల శివశంకర్, మహాలక్ష్మి, ఆర్డీటీ డాక్టర్ శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కంబదూరు షేక్ నబీరసూల్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు



వంతెనను నిర్మించాల్సింది ఇక్కడే



బ్రిడ్జి నిర్మాణం కోసం నిల్వ ఉంచిన కంకర, ఇసుక

వంతెన నిర్మాణం ఎన్నికల స్టంటేనా..?

- ఎన్నికల ముందు హడావుడిగా భూమిపూజ
- పనులు ప్రారంభిస్తున్నట్లు నెలన్నరపాటు కలరింగ్
- కోడ్ రావడంతో ఆ పనులకు పూర్తిగా బ్రేక్
- ఎన్నికల అనంతరం అటువైపే చూడని వైనం
- ఇది ఎ.నారాయణపురం చెక్ డ్యాంపై వంతెన నిర్మాణ దుస్థితి

అనంతపురంరూరల్, మే 19: రూరల్ మండలంలోని ఎ.నారాయణపురం చెక్ డ్యాం పై వంతెన నిర్మాణం వ్యవహారం కంచికి చేరింది. ఎన్నికల ముందు హడావిడిగా బ్రిడ్జి నిర్మాణానికి పాలకులు భూమి పూజ చేశారు. వంతెన నిర్మాణం కోసం కంకర, ఇసుక కూడా డంపు చేశారు. ఇది చూసిన జనం బ్రిడ్జి నిర్మాణం జరిగిపోతుంది.... ఓ సమస్య తీరుతుందని భావించారు. పాపం వారికి తెలీయదు కదా.. ఇందంతా.. నాయకులు చేస్తున్న ఎన్నికల హడావిడి అని. ఎన్నికల మధ్యలో కూడా స్థానికుల ఓట్ల కోసం నిర్మాణం చేస్తున్నట్లు సంబంధిత అధికారులతో కొలతలు వేయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు కలరింగ్ ఇచ్చారు. ఆ తరువాత బ్రిడ్జి నిర్మాణం వైపు చూసేవారే లేకుండా పోయింది.

హడావిడిగా భూమి పూజ

ఎ.నారాయణపురం చెక్‌డ్యాం పై బ్రిడ్జి నిర్మాణం స్థానికుల కల. అనేక ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికులు వినతులు ఇచ్చారు. వైసీపీ నాయకులు బ్రిడ్జి నిర్మాణం అదిగో.. ఇదిగో అంటూనే ఐదేళ్లు గడిపేశారు. ఈలోగా మళ్లీ ఎన్నికలు రానే వచ్చాయి. కోడ్ వస్తుందని భావించిన ఆ నాయకులు ఆగమేఘాలపై ఈ ఏడాది ఫిబ్రవరి 22న రూ.4.79 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి హడావిడిగా భూమి చేశారు. వారమైన కోడ్ రాలేదు. దీంతో కంకర, ఇసుక కూడా డంపు చేయించారు. అయినా కోడ్ రాకపోవడంతో ఆ నాయకులు.. అధికారులతో కొలతలు వేయిస్తూ.. స్థానికుల ఓట్ల కోసం దాదాపు నెలన్నర పాటు కలరింగ్ ఇచ్చారు. ఎట్టకేలకు ఏప్రిల్‌లో కోడ్ కావడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఇక కోడ్ పేరుతో ఆ పనులను అటకెక్కించేశారు. వాస్తవానికి భూమి పూజ చేసిన రోజుకు...కోడ్ రావడానికి దాదాపు నెలన్నర సమయం వచ్చింది. ఆ నాయకులకు చిత్తశుద్ధి ఉండుంటే ఆ పనులు నాడే పూర్తి అయ్యేవి. జనానికి మేలు జరిగుండేదీ. కాని ఆ దిశగా ప్రజాప్రతినిధులు చొరవ చూపలేదు. కోడ్ రాక ముందు ప్రారంభించిన పనులు కాబట్టి... ఎన్నికలు పూర్తి అవగానే ఆ పనులు ప్రారంభించవచ్చు. కాని ఆ నాయకులు నేడు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

ప్రయాణం సౌకర్యవంతం..

ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే అటుగా ప్రయాణం సాగించేవారికి చాలా వరకు సౌకర్య వంతంగా ఉంటుంది. పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ-1,2 వాసులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. అంతేకాకుండా నగరం నుంచి నరసనాయునికుంటా, గార్లదిన్నె మండలంలోని కోటంక సుబ్రమణేశ్వరస్వామి దర్శనానికి చాలా మంది వెళ్తుంటారు. వారికి ఇది చాలా వరకు అనువైన దారి.

పాండురంగస్వామి నిజపాద దర్శనం



అనంతపురం కల్చరల్, మే 19 : మోహినీ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం రామ్ నగర్‌లోని రుక్మిణీపాండురంగస్వామి దేవాలయంలో నిజపాద దర్శన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివార్ల మూల విరాట్‌లకు ఫలపంచామృతాభిషేకాలు చేయడంతో పాటు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

6.22 శాతం పెరిగిన ఓటింగ్

అనంతపురంరూరల్, మే 19: మండలంలో గత ఎన్నికలకు.. ఈ ఎన్నికలకు ఓటింగ్ దాదాపు 6.22శాతం పెరిగింది. 2019 సాధారణ ఎన్నికల్లో 71.31 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. అప్పట్లో 80,510 మంది ఓటర్లు ఉండగా..57,418 మంది ఓటేశారు. కాగా ఈ ఎన్నికల్లో 77.53 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. 81,451మంది ఓటర్లు ఉండగా.. 63,156 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఓటర్లు భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనడం పైనా ఆయా వర్గాల్లో చర్చసాగుతోంది. టీడీపీ నేతలు అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓటింగ్ జరిగిదంటుంటే.. పథకాల పనిచేశాయంటూ వైసీపీ నాయకులు మాట్లాడుకుంటున్నారు. పెరిగిన ఓటింగ్. ఓటర్లు ఎవరివైపు నిలిచారో మరికొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే.

పశువుల సంత ఆదాయం రూ.3.75 లక్షలు

అనంతపురంరూరల్, మే 19: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,75,250 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,79,950, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,95,300 ఆదాయం వచ్చిందని వివరించారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు : డీఎస్పీ

ధర్మవరంరూరల్, మే 19: గ్రామాల్లో ఎవరైనా గొడవలు పడినా, అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసులు రాజకీయ పార్టీ నాయకులకు హెచ్చరించారు. ఆదివారం కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌లో కనగానపల్లి మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన ముత్తవకుంట్ల, తల్లిమడుగుల, ఏలకుంట్ల, బద్దలాపురం, భానుకోట గ్రామాల రాజకీయ పార్టీల నాయకులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు, కౌంటింగ్ అనంతరం ఎవరు గెలిచినా, ఓడినా ఎదుటివారిని రెచ్చగొట్టడం, దూషణలకు దిగితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని హితువు పలికారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీఐ శివాంజినేయులు, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



అశోక్‌రెడ్డి (ఫైల్)

బత్తలపల్లి / ధర్మవరంరూరల్, మే 19: శ్రీ సత్యసాయి జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి వద్ద బైక్‌ను టిప్పర్ ఢీ కొన్న ప్రమాదంలో చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి (24), కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో కనగానపల్లికి చెందిన కందుకూరు క్రిష్టప్ప (55) మరణించారు. ప్యాదిండి గ్రామానికి చెందిన హనుమం తురెడ్డికి ఇద్దరు కూమార్తెలు, ఒక కూమారుడు అశోక్‌రెడ్డి. అశోక్ చెన్నైలో ఓ ప్రవేటు కాలేజీలో బీటెక్ పూర్తి చేశాడు. అతను తన స్నేహితుడు, బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌బాబుతో కలసి ఆదివారం ఉదయం చెన్నై నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి క్రాస్ వద్దకు రాగానే రాగ్ రూట్‌లో ఎదురుగా వస్తున్న ఇసుక టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్‌రెడ్డి అక్కడికి అక్కడికక్కడే మరణించాడు. విష్ణువర్ధన్ బాబు తీవ్రంగా గాయపడ్డాడు. 108లో విష్ణువర్ధన్‌బాబును ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ సోమశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

● కనగానపల్లికి చెందిన కందుకూరు క్రిష్టప్ప మామిళ్లపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై ఆదివారం బయలుదేరాడు. అనంతపురానికి చెందిన ముగ్గురు యువకులు సోహెల్, నారాయణ, లోకేష్ బైక్‌లో ననసకోట నుంచి నగరానికి బయలుదేరారు. మామిళ్లపల్లి సమీపంలో వీరు క్రిష్టప్ప బైక్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో క్రిష్టప్ప అక్కడికక్కడే మరణించాడు. ఆ ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో అనంత పురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్రిష్టప్ప మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్రిష్టప్పకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటోడ్రైవర్‌కు చేయూత



నాగరాజుకు ఆర్థికసాయం అందజేస్తున్న నిర్మలా మురళి

అనంతపురం కల్చరల్, మే 19 : పక్షవా తంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్ కుటుం బానికి నిత్యసురభి ట్రస్టు చేయూతనందించింది. రాజీవ్ కాలనీ పంచాయతీ భగత్‌సింగ్‌నగర్‌లో నివాసముంటున్న ఆటో డ్రైవర్ నాగరాజు ఇటీవల పక్షవాతానికి గురవడంతో కుడికాలు, కుడి చేయి పనిచేయడం లేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో నాగరాజు వైద్యం కోసం నిత్యసురభి ట్రస్టును ఆశ్రయించారు. దీంతో ఆదివారం ఆ ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి నాగరాజును కలిసి వైద్యం కోసం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు భాస్కర్, శశికళ పాల్గొన్నారు.

నేటి నుంచి అక్క దేవతల పరుష

కూడేరు, మే 19: మండలంలోని కరుట్లపల్లిలో సోమవారం నుంచి అక్కమ్మ దేవతల పరుష జరుగుతుందని నిర్వాహకులు మలోబన్న తెలిపారు. ఆలయంలో చెరుకు తీసుకురావడం, 21న అమ్మవారిని తిమ్మాపురం నుంచి కరుట్లపల్లి దేవాలయానికి ఊరేగింపుగా తీసుకురావడం జరుగుతుందన్నారు. 22న ఆలయ ఆవరణలో వసంతోత్సవం జరుగుతుందని, అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా తిమ్మాపురానికి తీసుకెళ్తామన్నారు.

స్ట్రాంగ్ రూంను పరిశీలించిన పరిటాల సునీత




స్ట్రాంగ్ రూం భద్రతను పరిశీలిస్తున్న పరిటాల సునీత, నాయకులతో సమావేశమైన మాజీ మంత్రి

అనంతపురం అర్బన్, మే 19 : జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూంలో రాప్తాడు నియోజకవర్గానికి సంబం ధించి ఈవీఎంల భద్రతను మాజీ మంత్రి పరిటాల సునీత సర్వేలెన్స్ ద్వారా పరిశీలించారు. ఆదివారం జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూం వద్దకు వెళ్లిన ఆమెకు అక్కడి అధికారులు స్ట్రాంగ్ రూంలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు, భద్రత తదితర అంశాలను వివరించారు.

నాయకులతో సమీక్ష

అనంతపురం నగరంలోని తన క్యాం పు కార్యాలయంలో పరిటాల సునీత రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల టీడీపీ నాయకులతో ఆదివారం ఆదివారం సమావే శమయ్యారు. ఆయా ప్రాంతాల్లో పంచాయతీ వారిగా పోలైన ఓట్లు... టీడీపీకి ఎంత మెజార్టీ వచ్చే అవకాశం ఉంది...? తదితర అంశాలపై చర్చించారు. గ్రామాల్లో అందరూ ప్రశాంత వాతావరణంలో ఉండాలని సూచించారు.

ఫైనల్లో అనంత జట్టు



ఫైనల్‌కు చేరిన అనంత రైజింగ్ స్టార్స్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, మే 19: అనంతపురం ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 పోటీల్లో అనంత రైజింగ్ స్టార్ జట్టు ఫైనల్‌కు చేరింది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2 క్రికెట్ పోటీలు ఆరో రోజైన ఆదివారమూ కొనసాగాయి. ప్లే ఆఫ్‌లో భాగంగా... ఫ్యామిలీక్లబ్, యునై టెడ్ చాంపియన్స్ క్రికెట్ క్లబ్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన ఫ్యామిలీ క్లబ్ నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్లకు 156 పరుగులు చేసింది. ఇందులో యోగానంద 60 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన యునైటెడ్ చాంపియన్స్ 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 133 పరుగులు మాత్రమే చేసింది. దీంతో చాంపియన్స్ జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. క్వాలిఫైయర్ మ్యాచ్‌లో అనంత రైజింగ్ స్టార్స్, ఇండియన్ సిక్సర్స్ జట్లు మధ్య జరగగా... అనంత రైజింగ్ స్టార్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లుకు 137 చేసింది. అనంతరం బరిలోకి ఇండియన్ సిక్సర్స్ జట్టు 19 ఓవర్లలో 102 పరుగులకే ఆలౌటైంది. అనంత రైజింగ్ స్టార్స్ బౌలర్ కమిల్ నాలుగు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంత రైజింగ్ స్టార్స్ జట్టు ఫైనల్‌కు చేరినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. సోమవారం ఫ్యామిలీ క్లబ్, ఇండియన్ సిక్సర్స్ జట్ల మధ్య క్వాలిఫయర్ 2 మ్యాచ్ జరగనుంది.

ముగిసిన రాష్ట్రస్థాయి యోగా అంపైర్ల శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మే 19: స్థానిక టెలిఫోన్ భవన్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యోగాసన అంపైర్ల శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో జిల్లా న్యాయాధికారి శివశంకర్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ యోగా పట్ల శ్రద్ధ పెంచుకుని, ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. పిల్లలకు ప్రాథమిక దశ నుంచే క్రీడల్లో భాగంగా యోగా నేర్పించి.. ప్రోత్సాహించాలన్నారు. చదువు, ఉన్నత స్థానాలకు చేరేందుకు యోగా చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డీజీఎం బాలగంగాధర్ రెడ్డి, బార్ అసోసియేషన్ న్యాయవాది గురుప్రసాద్, అనంతపురం క్లబ్ సెక్రటరీ కేశవరెడ్డి, ఏపీ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మారుతిప్రసాద్, తారకరామయ్య, దాదులూరయ్య, దివాకర్, గౌరవాధ్యక్షులు రవికాంత్ రమణ, కోశాధికారి రామకృష్ణ, అంపైర్లు శ్రీధర్‌రెడ్డి, నిర్మలరెడ్డి, అనీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శివశంకర్

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, మే 19: భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నేత, పార్లమెంట్‌లో మొట్ట మొదటి ప్రతి పక్షనేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా స్థానిక మల్లు స్వరాజ్యం నగర్‌లో ఆయన చిత్రపటానికి పలువురు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. సీపీఎం నగర కార్యదర్శి రామి రెడ్డి మాట్లాడుతూ.. రాయల సీమ జిల్లాలకు నీరిస్తేనే అభివృద్ధి సాధ్య మని నాడే సుందరయ్య చాటి చెప్పిన విషయాన్ని నేటి పాలకులు గుర్తెరు గాలని సూచించారు. దున్నే వాడిదే భూమి అన్న నినాదం తీసు కొచ్చి వేల ఎకరాలు కూలీలకు పంపి ణీ చేసిన ఘనత సుందరయ్యకే దక్కిందని పేర్కొన్నారు. సుందరయ్య ఆదర్శాలను కేవలం ఒకరోజు మననం చేసుకోవడంవల్ల సుందరయ్య కలలుకన్న సమాజ స్థాపన జరగదని, ఆయన అడుగుజాడల్లో పాలకులు, ప్రజలు నడిచినపుడే అది సాధ్యమవు తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రకాష్, వెంకట నారాయణ, మసూద్, బాలకృష్ణ, గఫూర్, వెంకటేష్, రాజీవ్ కాలనీ మాజీ సర్పంచ్ హుస్సేన్, అంజి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, కాలనీ నాయకులు డేవిడ్, భీమేష్‌కుమార్, మాబున్ని, మోహన, వలి పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలు



నీలం సంజీవరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కోనారెడ్డి, నాయకులు

గార్లదిన్నె, మే 19: మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి 111వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కల్లూరులో ఆయన అభిమాన సంఘం నాయకుడు ఏకే నరసింహులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తరిమెల కొనారెడ్డి మాట్లాడుతూ.. మారుమూల గ్రామమైన ఇల్లూరు గ్రామంలో రైతు కుటుంబంలో నీలం సంజీవరెడ్డి జన్మించారని, ఆయన రాజకీయ రంగంలో అంచెలంచెలుగా ఎదిగారని అన్నారు. రాష్ట్రపతిగా దేశానికి అనేక సేవలు చేశారని, ప్రధానంగా అనంతపురం జిల్లాలో ఎంపీఆర్ డ్యాం నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తరిమెల ప్రదీప్‌రెడ్డి, గట్టురామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, బుక్కచేర్ల నలపరెడ్డి, పెద్దన్న, చంద్రనాథ్‌రెడ్డి, పుల్లన్న, సంగప్ప, తిరుపతి నరసింహులు, జయరాంరెడ్డి, సుబ్బయ్య, రాంప్రసాద్, బృంధవన్ రామాంజి, కేశవయ్య, నల్లప్ప, రామచంద్ర, నాగార్జున పాల్గొన్నారు.

ఒకేసారి ఎనిమిది మందితో చెస్ మ్యాచ్



ఏకకాలంలో ఎనిమిది మందితో చెస్ మ్యాచ్ ఆడిన సాయి అగ్నిజీవితేష్

అనంతపురం క్లాక్‌టవర్, మే 19: ఏకకాలంలో ఎనిమిది మంది క్రీడాకారులతో ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ చెస్ మ్యాచ్ ఆడారు. ఐదు రోజులుగా స్థానిక సాయినగర్‌లోని ఏ1 ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌లో ఆదివారం ముగింపు సందర్భంగా క్రీడాకారులతో మా స్టర్ మ్యాచ్ నిర్వహించారు. తెలంగాణకు చెందిన ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ సాయి అగ్ని జీవితేష్ చదరంగంపై ఆయా అంశాలపై క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. చివరి రోజు ఎనిమిది మంది క్రీడాకారులతో ఏకకాలంలో మ్యాచ్ ఆడగా... ఏడుగురితో గెలిచిన సాయి... కేవలం జిల్లా క్రీడాకారుడు కౌశిక్ చిల్లాతో జరిగిన మ్యాచ్‌లో డ్రాగా నిలిచారు. ఆసక్తిగా సాగిన శిక్షణ, పోటీలలో అనేక అంశాలను నేర్చుకున్నామని క్రీడాకారులు తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, సీనియర్ క్రీడాకారులు వంశీకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు



రాయదుర్గంరూరల్, మే 19: పట్టణంలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఈఓ నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు ఉంటాయన్నారు. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, 21న నరసింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభ వాహనోత్సవం, 23న శేష వాహనం ఉంటుందన్నారు. 24న హనుమద్ వాహనం, 25న శ్రీవారి కల్యాణోత్సవం, 26న గజ వాహనోత్సవం, 27న ఉదయం మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తామన్నారు. 28న అశ్వవాహనం, 29న వసంతోత్సవం, 30న శయనోత్సవం ఉంటాయన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కుందుర్పి, మే 19: మండల పరిధిలోని ఎనుములదొడ్డి గ్రామంలో ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథాన్ని పూలతో అలంకరించారు. రథోత్సవం ఆలయం నుంచి గ్రామ చివరి వరకు కోలాహలంగా భక్తుల నడుమ సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

వంతెనల నిర్మాణానికి మోక్షమెన్నడో..?

ఏళ్లుగా ఆగిపోయిన పనులు

ఉరవకొండ, మే 19: హంద్రీనీవా కాలువలపై వంతెన నిర్మాణాలకు మోక్షం లభించడం లేదు. 33, 36వ ప్యాకేజీల్లోని వంతెనలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 33వ ప్యాకేజీ ఉరవకొండ-గుంతకల్లు రహదారిపై వంతెన నిర్మాణానికి ఐదేళ్ల క్రితం గుంతలను తవ్వి వదిలేశారు. దీంతో తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డుపైనే వాహనాల రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మట్టి రోడ్డు గుండా వెళ్లే వాహనాలు చిన్న పొరపాటు జరిగినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ఉరవకొండ- చాబాల, ఉరవకొండ-హోతూరు రహదారిల్లోని హంద్రీనీవా కాలువపై వంతెన నిర్మాణాలు చేపట్టలేదు. ఉరవకొండ-హోతూరు రహదారిలో డి2డిస్ట్రిబ్యూటరిలో వంతెన నిర్మాణం పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



వంతెన నిర్మించాల్సిన చోట ఏర్పడిన గుంతల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు

నేటి నుంచి ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రసన్న వేంకటరమణ స్వామి

రాయదుర్గంరూరల్, మే 19: పట్టణంలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఈఓ నరసింహా రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు ఉంటాయన్నారు. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, 21న నరసింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభ వాహనోత్సవం, 23న శేష వాహనం ఉంటుందన్నారు. 24న హనుమద్ వాహనం, 25న శ్రీవారి కల్యాణోత్సవం, 26న గజ వాహనోత్సవం, 27న ఉదయం మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తామన్నారు. 28న అశ్వవాహనం, 29న వసంతోత్సవం, 30న శయనోత్సవం ఉంటాయన్నారు.

ఘనంగా మోహినీ ఏకాదశి



భూదేవి, శ్రీదేవి అమ్మవార్లతో వేణుగోపాల స్వామి

పామిడి, మే 19: పట్టణంలోని అనంత గజ, గరుడ లక్ష్మీనారాయణస్వామి, వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆదివారం మోహిని ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సహిత స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణం గోవింద నామ స్మరణతో మార్మోగింది.

చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి

పెద్దవడుగూరు, మే19: మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



భక్తజనం మధ్య సాగుతున్న రథోత్సవం

కుందుర్పి, మే 19: మండల పరిధిలోని ఎనుములదొడ్డి గ్రామంలో ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథాన్ని పూలతో అలంకరించారు. రథోత్సవం ఆలయం నుంచి గ్రామ చివరి వరకు కోలాహలంగా భక్తుల నడుమ సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా పట్టమదేవర

బొమ్మనహాళ్, మే 19: మండల పరిధిలోని గోవిందవాడ గ్రామంలో ఆలుమత కురుబ సంఘం ఆధ్వర్యంలో పట్టమ దేవర మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదావతి హగరిలో విడపనకల్లేశ్వర స్వామి వారికి గంగాజలంతో అభిషేకించి విశేష పూజలు నిర్వహించారు. పుష్పాలంకరణ జరిపించి అక్కడి నుంచి 101 కలశాలతో స్వామివారిని ఊరేగింపుగా గ్రామానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో విడపనకల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు.



ఎస్కేయూ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులతో పూర్వవిద్యార్థులు



పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుంతకల్లుటౌన్, మే 19: పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో ఆదివారం 2001-04సంవత్సరంలో బీఏ చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అప్పటి ఆధ్యాపకులు హాజరయ్యారు. 20సంవత్సరాల తరువాత ఒకరినొకరు పలకరించుకొని రోజంతా ఆనందంగా గడిపారు. కళాశాలలో చదువుకున్న జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం ఆధ్యాపకులను పూర్వ విద్యార్థులు సత్కరించారు.

పామిడి: పట్టణంలో 2006-2008 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజులకు సంబంధించి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం అధ్యాపకులను సన్మానించారు.



రాయదుర్గంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘననివాళి

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు ఆదివారం సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. చిన్నవయసులోనే కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడారని కొనియాడారు. అనేక ఉద్యమాలలో పాల్గొన్నారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



కళ్యాణదుర్గంలో అంతర్జాతీయ క్యాండిల్ డే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అంతర్జాతీయ క్యాండిల్ డే

అంతర్జాతీయ క్యాండిల్ డేను ఆదివారం పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించాయి. ప్రతి సంవత్సరం మే 3వ ఆదివారాన్ని అంతర్జాతీయ క్యాండిల్‌డేగా జరుపుకుంటారు. హెచ్ఐవీ బారిన పడి మృతి చెందిన వారికి గుర్తుకు దీనిని జరుపుకుంటారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

విత్తన వేరుశనగ కోసం 296 మంది రిజిస్ట్రేషన్

రాయదుర్గంరూరల్, మే 19: మండలంలోని 19 పంచాయతీల్లో 14 ఆర్‌బీకే కేంద్రాలలో వేరుశనగ విత్తన కొనుగోలుకు సంబంధించి 296 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఏవో మహేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 17 వేల హెక్టార్లలో సాగులో భాగంగా 14560 హెక్టార్లలో 10163 మంది రైతులు వేరుశనగ సాగు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో ఈ నెల 23వ తేదీ వరకు వేరుశనగ కొనుగోలుకు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెద్దవడుగూరు: మండలంలోని ఆయా రైతుభరోసాకేంద్రాల్లో వేరుశనగ విత్తనం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేశ్వరి ఆదివారం తెలిపారు. అర్థ ఎకరా ఉన్నవారికి బస్తా, ఎకరాలోపు ఉన్న వారికి రెండు బస్తాలు, 1నుంచి 5ఎకరాల్లోపు ఉంటే మూడు బస్తాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, మే 19: మండలంలోని తొండపాడు గ్రామాశివారులో ఎద్దుల బండి కింద పడి అజయ్ కుమార్‌కి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన అజయ్ కుమార్ తెల్లవారుజామున తన పొలానికి ఎద్దుల బండి కట్టుకొని పొలంలో గుంటక పాసి తిరిగి ఇంటికి వస్తుండగా ఎద్దులు బెదిరాయి. అజయ్ కమార్ అదుపు చేయలేక బండి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేప్పట్టారు.

టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడికి నోటీసుల అందజేత

గుత్తి, మే 19: పట్టణంలోని దిగుత్తికోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్‌కు ఆదివారం పోలీసులు నోటీసులు అందజేశారు. ఆదివారం టౌన్‌బ్యాంక్ సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మహాజన సభ నిర్వహించరాదని పోలీసులు ఆయనకు నోటీసులు అందజేశారు. దీంతో మహాజన సభను వాయిదా వేసినట్లు టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, సీఈఓ మహేశ్వరప్రసాద్ తెలిపారు.

కణేకల్లులో భారీ వర్షం



కణేకల్లు, మే 19: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు మూడు గంటలపాటు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వర్షం పడటంతో పొలాల్లో సేద్యం పనులు చేసుకునేందుకు అనుకూలంగా వుంటుందని పలువురు రైతులు పేర్కొన్నారు.

బెళుగుప్ప: మండలంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. తొలకరి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మండలంలోని అన్ని గ్రామాలలో మోస్తరు వర్షం కురవడంతో పొలం పనులు చేసుకునేందుకు, దుక్కులు దున్నకునేందుకు అనుకూలంగా వుంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, మే 19: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేషపుష్పాలంకరణచేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో సౌందర్యలహరి పారాయణ పూర్వక పార్వతీదేవి హవనం, హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి 8గంటలకు అమ్మవారిని వెండి రథోత్సవంలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.

మురుగు కాలువలో పూడిక తీత

గుత్తి, మే 19: గుత్తి ఆర్ఎస్‌లోని 8వ వార్డులోని ప్రధాన మురుగు కాలువలో పేరుకుపోయిన పూడికను స్థానిక టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి 8వ వార్డులో పలు వీధులు జలమయమయ్యాయి. ఈ వార్డు పరిధిలో ఉన్న పెద్ద కాలువలో పూడికపేరుకుపోవడంతో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్థానిక టీడీపీ నేతలు అబ్దుల్‌వహాబ్, నాగరాజు మురుగు కాలువలో పూడికతీతను జేసీబీ సహకారంతో తీశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీనాయకులు వలిసాబ్, చిదంబరయ్య, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

వీహెచ్‌పీ కమిటీ ఎన్నిక

కణేకల్లు, మే 19: స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి దేవాలయంలో వీహెచ్‌పీ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా డోన్ రవిచంద్ర, ఉపాధ్యక్షుడిగా దత్త తిప్పేస్వామి, కార్యదర్శులుగా బారిక నాగరాజు, రాచర్ల రమేష్, కురుబ సంతోష్, అవ్వ వినోద్, వెంకటేశ్వర, హోసగుడ్డం ఆదిత్య కుమార్, దాసరి హరిప్రసాద్, కరణం మణికంఠ, సద్దల శేఖర్, కురుబ మహేష్, వడ్డే రాజుతోపాటు పలువురిని సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వీహెచ్‌పీ అధ్యక్షుడు దేవిరెడ్డిపల్లి రాజేష్, నాయకులు రామమూర్తి, మద్దిలేటి సత్యనారాయణ, సజ్జల శ్రీనివాసులు పాల్గొన్నారు.

తల్లిపై తనయుడి దాడి

రాయదుర్గంరూరల్, మే 19: తల్లిపై తనయుడు దాడి చేసిన సంఘటన పట్టణంలోని వాల్మీకి నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. నాగరత్నమ్మ, ఆంజనేయులు కుమారుడు ఎర్రిస్వామి. కుటుంబ సమస్య నేపథ్యంలో ఎర్రిస్వామి ఆదివారం తల్లి నాగరత్నమ్మపై దాడిచేశాడు. తలకు గాయం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, మే 19: మండలంలోని వెలమకూరు గ్రామానికి చెందిన కొండారెడ్డి (70) ఆదివారం విషపుగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ పోలీసులు తెలిపారు. కొండారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో విషపుగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

గుంతకల్లుటౌన్, మే 19: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఆటోడ్రైవర్ అబ్దుల్లాను కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు షేక్ సికిందర్ బాషా అలియాస్ చాంద్‌బాషాను ఆదివారం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ గణేష్ తెలిపారు. ఉదయం స్థానిక హనుమాన్ జంక్షన్ రైల్వే స్టేషన్ ముందర సికిందర్ అలియస్ చాంద్‌బాషను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

బెళుగుప్ప, మే 19: మండలంలోని విరుపాపల్లిలో ఆదివారం విద్యుదాఘాతంతో చైతన్య (21) మృతిచెందింది. చైతన్య ఇంటి వద్ద దుస్తులు ఉతుకుతూ నీటి కోసం మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్ తీగలు తాకి షాక్ కొట్టింది. వెంటనే ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బెళుగుప్ప, మే 19: మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ఏ వన్నూరుస్వామి (56) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ శివ తెలిపారు. రెండేళ్ల క్రితం భార్య మృతి చెందడంతో జీర్ణించుకోలేక మనస్థాపానికి గురై శనివారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి అపస్మారకస్థితిలో వుండగా చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నేటి నుంచి అక్క దేవతల పరుష

కూడేరు, మే 19: మండల పరిధిలోని కరుట్లపల్లి గ్రామంలో సోమవారం నుంచి అక్కమ్మ దేవతల పరుష జరుగుతుందని నిర్వాహకులు మల్లోబన్న తెలిపారు. ఆలయంలో చెరుకు తీసుకురావడం, 21న అమ్మవారిని తిమ్మాపురం నుంచి కరుట్లపల్లి దేవాలయానికి ఊరేగింపుగా తీసుకురావడం జరుగుతుందన్నారు. 22న ఆలయ ఆవరణలో వసంతోత్సవం జరుగుతుందని, అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా తిమ్మాపురం గ్రామానికి తీసుకువెళ్లడం ఉంటుందన్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మని భక్తులు కొలుస్తారన్నారు.

రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచె



రోడ్డుకు అడ్డంగా వేసిన ముళ్లకంచె

పుట్లూరు, మే 19: తాడిపత్రి ఘటనను దృష్టిలో ఉంచుకొని మండలకేంద్ర శివారులోని పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుకు అడ్డంగా పోలీసులు ముళ్లకంచె వేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా వేయడంతో పెట్రోల్ బంక్ లోపల వెళ్లి పుట్లూరు గ్రామంలోకి వెళతున్నారు. రోడ్డు వద్ద బందోబస్తుగా పోలీసులు ఉన్నా కంచె వేయడం గమనార్హం. పుట్లూరు, కోమటికుంట్ల, జీసీపల్లి, బాలాపురం, నాయకునిపల్లి తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

చంద్రబాబు సీఎం కావాలని పూజలు



దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రాయదుర్గంరూరల్, మే 19: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నాయకులు ప్రహల్లాద, తమ్మయ్య, దాసరి సత్తి, పైతోట శీనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన దశభుజ గణపతి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలవ శ్రీనివాసులు అత్యధిక మెజార్టీతో గెలవాలని పూజలు చేశారు.

రక్తదానం చేసి.. ప్రాణదాతలు కండి

గుంతకల్లుటౌన్, మే 19: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పేర్కొన్నారు. జూనియర్ ఎన్టీఆర్ 41వ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు, లెజెండ్ బ్లడ్‌ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక గోపీ చారిటబుల్ ట్రస్ట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో లెజెండ్ బ్లడ్‌ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రంజాన్, సభ్యులు తిమ్మప్ప, పక్కీరప్ప, బషీర్, నందు, సాగర్, హర్ష, సాయి, తౌసీఫ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆర్డీటీ సెట్

ఉరవకొండ, మే 19: కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షను నిర్వహించారు. 322మంది విద్యార్థులకు గానూ 318మంది హాజరయ్యారని, జిల్లావ్యాప్తంగా 10 కేంద్రాల్లో నిర్వహించినట్లు రీజనల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

యాడికి, మే19: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మోహనవల్లి, సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం యాడికిలో సాయుధబలగాలు కవాతు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తాడిపత్రిలో ఎన్నికల అనంతరం అల్లర్ల నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. కవాతులో ఆర్ఐ ఆనంద్‌బాబుఆచారి, పోలీసులు పాల్గొన్నారు.

వనభోజనాలకు తరలిన గ్రామస్థులు

పెద్దవడుగూరు, మే19: మండలంలోని బుర్నాకుంట గ్రామస్థులు ఆదివారం వనభోజనాలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామశివారులో ఉన్న అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది వనభోజనాలకు తరలివెళతామని వారు తెలిపారు.